

సీసెల్ క్రాఫ్ట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



పోటరీ (మట్టి)తో తయారు చేసిన ఆకృతులను చూపిస్తున్న చిన్నారులు



ట్రైబల్, మండల పెయింటింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



సమ్మర్ ఆర్ట్‌క్యాంపు

శిల్పారామంలో 92 మంది విద్యార్థులకు శిక్షణ

వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం శిల్పారామం సమ్మర్ ఆర్ట్ క్యాంపును నిర్వహిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి 92 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. 17 రోజుల పాటు నిర్వహించనున్న ఈ క్యాంపులో పోటరీ, పెన్సిల్ స్కెచ్, సీసెల్ క్రాఫ్ట్, మధుబని, ట్రైబల్ పెయింటింగ్ ,మండల పెయింటింగ్, లిప్పన్ ఆర్ట్, సంస్కృతం, భగవద్గీత శ్లోకాలలో శిక్షణ ఇస్తున్నారు. పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాలలో ప్రోత్సహిస్తే మరింత రాణించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సంస్కృతం నేర్చుకోవడం, భగవద్గీత శ్లోకాల విశిష్టత గురించి వివరిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా ఈ క్యాంపు ఈ నెల 17వ తేదీ వరకు ఉంటుంది. – మాదాపూర్

పోటరీ అంటే చాలా ఇష్టం..



సమ్మర్ ఆర్ట్ క్యాంపులో మొదటిసారిగా శిక్షణ తీసుకుంటున్నాను. మట్టితో వివిధ రకాల ఆకృతులను తయారు చేస్తున్నాను. కుండలు, దీపం కుందులు, మట్టి గ్లాస్, పాత్రలు తయారు చేస్తున్నాను.

– మైరాశ్రీ, 2వ తరగతి విద్యార్థిని

సంస్కృతం, భగవద్గీత తప్పనిసరిగా నేర్చుకోవాలి



భగవద్గీత మానవ జీవన విధానాన్ని తెలుపుతుంది. భగవద్గీత శ్లోకాలు సంస్కృతంలో ఉంటాయి. ఆ భాషను నేర్చుకుంటే మిగిలిన అన్ని భాషలను సులువుగా నేర్చుకోవచ్చు. భగవద్గీత గురించి తెలుసుకుంటే మనిషి మంచి నడవడికతో ఉన్నత శిఖరాలను చేరవచ్చు. లిప్పన్ ఆర్ట్, మండల పెయింటింగ్ నేర్చుకుంటే గృహిణులకు ఎంతో ఉపయోగం. ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుంది.

– లిప్పన్ ఆర్ట్ టీచర్ మైత్రేయి

పెయింటింగ్‌లో రాణిస్తా..

పెయింటింగ్ అంటే ఇష్టం. ట్రైబల్, మండల పెయింటింగ్‌లలో శిక్షణ తీసుకుని రాణిస్తే స్వయం ఉపాధి కలుగుతుంది. పెయింటింగ్ వేసేటప్పుడు మనస్సు, మెదడు చురుకుగా పనిచేస్తాయి.

– అశిక, 4వ తరగతి విద్యార్థిని

ఈవీఎంల తరలింపు.. స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్



డీఆర్‌సీ సెంటర్‌లో రంగారెడ్డిజిల్లా కలెక్టర్ శశాంక్, జెడ్సీ, ఏఆర్‌ఓ స్నేహశబరీష్ తదితరులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. సోమవారం పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను గచ్చిబౌలి స్టేడియంలోని డీఆర్‌సీ సెంటర్‌లో అప్పగించారు. ఈవీఎంల స్క్రూటీని, బాక్స్‌లలో ప్యాక్ చేయడం మంగళవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. ఉదయం 6 గంటలకు ప్రత్యేక వాహనాల్లో భారీ బందోబస్తు మధ్య చేవెళ్లలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. పోలింగ్ ప్రక్రియ, ఈవీఎంల తరలింపు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్

గచ్చిబౌలి స్టేడియంలోని డీఆర్‌సీ సెంటర్‌లో ఈవీఎంలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ అర్ధరాత్రి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈవీఎంలు గచ్చిబౌలి డీఆర్‌సీ సెంటర్ నుంచి చేవెళ్లలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపు ప్రక్రియను అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. పార్లమెంటు ఎన్నికలలో భాగంగా చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఈవీఎం మిషన్లను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. దీన్ని మంగళవారం రంగారెడ్డిజిల్లా కలెక్టర్ శశాంక్, జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్, ఏఆర్‌ఓ స్నేహ శబరీష్‌తో కలిసి పరిశీలించారు. నియోజకవర్గంలోని 633 పోలింగ్ కేంద్రాలలో వినియోగించిన ఈవీఎంలను కంట్రోల్ యూనిట్ వీవీపాట్లను మంగళవారం ఉదయం ప్రత్యేక వాహనంలో పటిష్ట భద్రత నడుమ చేవెళ్లలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.

పోలైన ఓట్లు 3,26,818.. గెలుపు, ఓటమిలపై అంచనాలు

అసెంబ్లీ ఎన్నికల్లో 30,256 ఓట్లు అధికం

గచ్చిబౌలి: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయనే విషయంపై ఆయా పార్టీల నాయకులు అంచనాల్లో నిమగ్నమయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 30,256 ఓట్లు తక్కువగా పోలయ్యాయి. మొత్తం ఓట్లు 7,58,102 ఓట్లు ఉండగా 3,26,818 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం మొత్తం ఓట్లు 7,32,506 ఉన్నాయి. పోలింగ్‌లో 3,57.074 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే 48.75 శాతం ఓట్లు నమోదయ్యాయి.

ముందంజలో బీజేపీ.. ?

అసెంబ్లీ ఎన్నికల్లో శేరిలింగంపల్లి మూడో స్థానంలో నిలిచిన బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో మొదటి స్థానంలోకి దూసుకెళుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. రెండో స్థానం కాంగ్రెస్, మూడో స్థానంలో బీఆర్ఎస్ ఉంటుందని పరిశీలకులు అంటున్నారు.

పటాన్‌చెరులో...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో అంతటా నిశ్శబ్దం అలుముకుంది. 20రోజులుగా అభ్యర్థులు ప్రచారాలలో బిజీ బిజీగా గడిపారు. గడపగడపకు ప్రచారాలు, ర్యాలీలు నిర్వహించారు. నాయకుల పర్యటనలతో సందడిగా మారిన వీధులు నిశ్శబ్దంగా కనిపిస్తున్నాయి. నాయకులు కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతున్నారు. వివిధ పార్టీల కార్యకర్తలు కలసికట్టుగా కూర్చొని గెలుపు, ఓటమిలపై అంచనాలు వేసుకుంటున్నారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ. పోలింగ్ కేంద్రాల వారీగా పడిన ఓటింగ్ శాతాన్ని అరా తీస్తున్నారు .మరి కొందరు సరదాగా గడిపేందుకు యాత్రలకు సిద్ధమవుతున్నారు. ఇక ఓటరు దేవుళ్లు ఇచ్చే తీర్పు కోసం వేచి చూడాల్సిందే.

నేడు చిత్రప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నేడు స్పెక్ట్రమ్ పేరిట చిత్ర ప్రదర్శనను ప్రారంభం కానుంది. ఈ ప్రదర్శనను ఉదయం 11గంటలకు త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

జేఎన్‌వీ హైదరాబాద్ దేశంలోనే టాప్

జేఎన్‌వి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ

రాయదుర్గం: సీబీఎస్ఈ పది, పన్నెండవ తరగతి బోర్డు పరీక్షలలో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ జయకేతనం ఎగురవేసింది. దేశంలోని అన్ని రీజియన్లలో హైదరాబాద్ రీజియన్ టాప్‌లో నిలిచిందని మంగళవారం రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ తెలిపారు. శేరిలింగంపల్లి డివిజన్ గోపన్‌పల్లిలోని నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ రీజియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 8 రీజియన్లు ఉండగా హైదరాబాద్ రీజియన్ సీబీఎస్ఈ బోర్డు పరీక్షలలో మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు.

మహిళ అదృశ్యం



మియాపూర్ : ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీష్ తెలిపిన సమాచారం మేరకు... కామారెడ్డి జిల్లాకు చెందిన సాయవ్వ(50) భర్త పోచయ్యతో కలిసి మియాపూర్‌లోని మక్తలో నివాసం ఉంటుంది. స్థానికంగా కూలీపని చేస్తున్నారు. ఈ క్రమంలో సాయవ్వ ఈ నెల 7వ తేదీన ఉదయం మియాపూర్‌లోని కూలీఅడ్డాకు వెళ్లింది. సాయంత్రం అయిన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టు పక్కల బంధువులు, స్నేహితులు ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త పోచయ్య మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, సంఘం నాయకులు

ఆల్విన్‌కాలనీ: భగీరథ మహర్షి జయంతి సందర్భంగా నగర ఉప్పర సంఘం, జగద్గిరిగుట్ట ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ భగీరథ మహర్షి పేరుపై కేసీఆర్ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని తీసుకువచ్చి ఇంటింటికి మంచినీటి సరఫరా చేశారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, స్థానిక నగర సంఘం అధ్యక్షుడు అస్కనీ కొండయ్య సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని శ్రీనివాస్ సాగర్, కోశాధికారి రాజేష్ సాగర్, గ్రేటర్ హైదరాబాద్ సగర ఉప్పర సంఘం గౌరవాధ్యక్షులు అస్కని వెంకటస్వామి సాగర్, అధ్యక్షులు మోడల రవిసాగర్, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకటరాములు సాగర్, కోశాధికారి రామస్వామి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ఉచిత రాజయోగ శిక్షణ తరగతులు

వెంగళరావునగర్ : ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు ఉచిత రాజయోగ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ మధురానగర్‌శాఖ నిర్వాహకులు ఎస్.రాధిక తెలిపారు. మధురానగర్‌కాలనీలోని డీ–బ్లాకు పార్క్ సమీపంలో ఉన్న నిహారిక నిలయంలో రోజు ఉదయం 7 నుంచి 8, సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 99124 01733 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీ వెంకటేశ్వర, యోగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారి ఆలయం నిర్మించి 55 ఏళ్లు పూర్తైన సందర్భంగా వేడుకలను నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలో భాగంగా మంగళవారం శ్రీవేంకటేశ్వర మూలమంత్ర జపం, మహా సుదర్శన హోమం, సుందరకాండ పారాయణం నిర్వహించారు. హనుమంత వాహనంపై స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణమాచార్యులు మాట్లాడుతూ ఈనేల 18వతేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పైప్‌లైన్ లీకేజీ.. మంచినీటి వృథా



ఆస్‌బెస్టాస్ కాలనీ కమాన్ వద్ద రోడ్డుపై పారుతున్న తాగునీరు

ఆల్విన్‌కాలనీ: అసలే మండుటెండలు, దీనికి తోడు మంచినీరు దొరకక నానా అవస్థలు పడుతున్నారు .ఇటువంటి పరిస్థితిలో వాటర్‌వర్క్స్ అధికారులు, సిబ్బంది అలసత్వం కారణంగా పలు ప్రాంతాల్లో మంచినీరు రోడ్డుపై వృథాగా పోతోంది. కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. వేల గ్యాలన్ల నీరు రోడ్డు పాలవుతున్నది. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ కమాన్ వద్ద మంచినీటి పైపులైను దెబ్బతిని నీరు వృధాగా పోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షం పడితే చిత్తడే..

హఫీజ్‌పేట్: రెండు రోజుల క్రితం కురిసిన చిన్నపాటి వర్షానికి హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో ఆర్టీసీ కాలనీ మంజీరారోడ్డులో రోడ్లు చిత్తడిగా మారాయి. ఒకవైపు నూతన పైప్‌లైన్ పనులు.. మరోపక్క గుంతలు రోడ్లు వెరసి చిన్నపాటి వర్షానికి చిత్తడి అవుతున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం సమయాలలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మంజీరా రోడ్డులోని హుడాకాలనీ, ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్, ఆర్టీసీ కాలనీ, మైత్రీనగర్, వైశాలీనగర్ ప్రాంతాలలో గుంతల రోడ్లతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో మరింత ఇబ్బందులు ఏర్పడుతాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరారు.



ఆర్టీసీ కాలనీ వద్ద చిత్తడిగా మారిన రోడ్డు

నిర్వహణ నాస్తి

పల్లె ప్రకృతి వనాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పలుచోట్ల మొక్కలకు నీరు పోయకపోవడంతో ఎండు ముఖం పడుతున్నాయి. ఇప్పటికే వనాల్లో పిచ్చి మొక్కలు మొలవగా శుభ్రత పనులు చేపట్టడం లేదు.బాధ్యతలు నిర్వహించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది.



వీరన్నగూడెంలో మొక్కలు లేని పల్లె ప్రకృతి వనం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని అన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను అధికారులు ఆర్భాటంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఖాజీపల్లి, కొర్లకుంట, నల్తూర్, వావిలాల, మంగంపేట తదితర గ్రామాలతో పాటు గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం, అనంతారం, కొత్తపల్లి, నల్లవల్లి, అన్నారం తదితర గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు కళా విహీనంగా మారాయి. ఎండా కాలం కావటంతో సరిపడా నీరు లేకపోవటంతో వనాల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. నీరు పోసేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. దీంతో మొక్కలు ఎండిపోయాయి. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవటంతో ప్రత్యేకాధికారులు పల్లె ప్రకృతి వనాలను మెరుగుపర్చటంలో పూర్తిగా విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వనాలను కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించటం లేదు. మొక్కలు పెంచి పూర్వవైభవం తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు ఎండిపోకుండా చర్యలు
ఉమాదేవి, ఎంపీడీఓ గుమ్మడిదల

పల్లె ప్రకృతి వనాల నిర్వహణ ప్రస్తుతం బాగానే ఉంది. ఎప్పటికప్పుడు వనాలను సందర్శిస్తూనే ఉన్నాం. నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారులకు సూచనలిస్తున్నాం. మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 30, పచ్చిమిర్చి 65, బెండ 45, కాకర 60, దొండ 50, దోస 40, ఆలు 35, చామ 60, కీర 40, బీర 70, వంకాయ 40, గోకర 50, బీన్స్ 140, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 40, క్యారెట్ 55, చిక్కుడు 90, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 250.

మనూలో ఎంబీఏ, ఎంకామ్ కోర్సులలో ప్రవేశాలు

దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ మే 20

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో ఉర్దూ మాధ్యమంలో ఎంబీఏ, ఎంకామ్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నామని ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్ మంగళవారం తెలిపారు. ఏఐసీటీఈ సిఫార్సు చేసిన సిలబస్‌నే బోధిస్తున్నామన్నారు. ఏదైనా సబ్జెక్టులో 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ప్రవేశ ఆధారిత ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి అర్హులని ఆయన వివరించారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను సమర్పణకు చివరి తేదీ మే 20గా నిర్ణయించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఉర్దూ మాధ్యమంలో మెరిట్ ఆధారిత ఎంకామ్ కోర్సులో ప్రవేశాలను కూడా అందిస్తోందని, దీనికోసం దరఖాస్తును సమర్పించడానికి చివరి తేదీగా జూన్ 30గా నిర్ణయించామన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్‌లు 9849325765, 9849847434లలో సంప్రదించాలని కోరారు. యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో వివరాలు చూడొచ్చన్నారు.

'ఐఎఫ్ఎస్'కు ఎంపికైన పెద్దిరెడ్డి వాసంతి

హర్షం వ్యక్తం చేసిన హెచ్‌సీయూ ఫ్యాకల్టీ



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని పెద్దిరెడ్డి వాసంతి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. ఆమె సివిల్ సర్వీసెస్ ఐఎఫ్ఎస్ విభాగంలో ఆలిండియా స్థాయిలో 50వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు మంగళవారం హెచ్‌సీయూ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూలో ఆమె హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ బ్యాచ్ 2015–17లో ఎంబీఏ చేశారు. ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కి ఎంపిక కావడం హెచ్‌సీయూకు గర్వకారణమని ఫ్యాకల్టీ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఎంతో చలువ.. తాటి ముంజలు



శేరిలింగంపల్లి: తాటి ముంజలకు మంచి గిరాకీ ఉంది. ఎండ వేడికి తాటి ముంజలు తింటే దప్పిక రాదు. దీంతో ప్రజలు తాజా ముంజలు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ వద్ద ఉన్న నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జికి వెళ్లే ప్రధాన రోడ్డుపై ముంజలను విక్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు నుంచి రోజు ట్రావెల్స్ బస్సులలో తెచ్చి అమ్ముతున్నారు. డజను తాటి ముంజలను రూ.120లకు విక్రయిస్తున్నారు.

ఎన్నికలు ముగిసిన వేళ..

మనుమడితో ఆటలాడిన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం, పార్టీ శ్రేణులతో సమీక్ష సమావేశాలతో బిజీగా గడిపిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం సరదాగా గడిపారు. తన మనుమడు ఆర్యవీర్‌తో ఆటలాడుతూ, టీవీలో కార్టూన్ వీడియోలను చూస్తూ మనుమడితో ఆడుకున్నారు.

జాతీయ రహదారిపై మురుగు



రామచంద్రాపురం(పటాన్‌చెరు) : జాతీయ రహదారిపై మురుగు నీరు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిని అభివృద్ధి చేసిన సమయంలో వర్షపు నీరు పోయేందుకు రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీటి కాలువలను నిర్మించారు. కానీ ప్రస్తుతం ఆ కాలువలో డ్రైనేజీ నీరు ప్రవహిస్తుంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భవనాలకు చెందిన డ్రైనేజీ నీటిని ఈ కాలువలలో వదులుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుపై మురుగు నీరు చేరడం కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

హెచ్‌కేఎం ఫౌండేషన్‌కు వాహనం అందజేత

మణికొండ: నిరుపేదలకు ఆహారం అందిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ (అక్షయపాత్ర) ఫౌండేషన్‌కు సావరియ పైప్స్ సంస్థ రూ.16.5లక్షల విలువైన విద్యుత్ వాహనాన్ని మంగళవారం అందించారు. సమాజంలో వెనకబడిన వర్గాలకు ఆహారాన్ని అందించటానికి ఫౌండేషన్ చేస్తున్న కృషికి తమ వంతు సహకారాన్ని అందించేందుకు ప్లంబింగ్, ఎలక్ట్రికల్ సొల్యూషన్స్‌లో అగ్రగామి సంస్థ సావరియ సంస్థ ముందుకు రావటం అభినందనీయమని హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస ప్రభుజీ అన్నారు. కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.